# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

## THE WORD OF TRUTH



**OCTOBER 1994**

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

(క్రీస్తు సంఘం)

## ఆహ్వానము

## గొప్ప బైబిల్ సెమినార్

ఉపన్యాసకులు : పెర్రి బి. కాతమ్, U.S.A
జాన్ ఫోర్డ్స్, U.S.A
నేన్సి ఫోర్డ్స్, U.S.A
(స్త్రీలకు ప్రత్యేక తరగతులు)

తేదీలు : 1994 డిశంబరు 12 సోమవారం నుండి 17వ తేదీ శనివారం మధ్యాహ్నం వరకు

సమయం : ప్రతిరోజు ఉదయం 10 గం॥లకు
మధ్యాహ్నం 3 గం॥లకు సాయంకాలం 6-30 గం॥లకు

స్థలం : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణ
విద్యుత్ నగర్, కాకినాడ-533 003

గొప్ప పునరుద్ధరణ ఉద్యమము :- వేల కొలది ప్రజలు ప్రతి సంవత్సరం హాజరగుచున్నారు - ఇండియా లోని 11 రాష్ట్రాల నుండి ప్రజలు తరలి వచ్చుచున్నారు. హాజరగుచున్నారు. గొప్ప వర్తమానములు అందించబడు చున్నవి. వందలకొలది సువార్తకు లోబడుచున్నారు. గొప్ప ఆత్మీయ విందు మరియు సహవాసము - ఆత్మలు బలపడు చున్నవి - సంఘములు ప్రోత్సహించబడి, బలపడుచున్నవి - ఈ గొప్ప తరుణమును పోగొట్టుకొనవద్దు. అందరికి, అన్ని మతశాఖల వారికి, వారి బోధకులకు ప్రత్యేక ఆహ్వానము. ఉచిత భోజనం, వసతి ఏర్పాటు గలదు.

వివరములకు : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్,
పోస్టు బాక్సు నెం. 57, కాకినాడ 533 001

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 అక్టోబరు 1994 సంచిక 3


# సంపాదకీయము

## మనము నమ్మకముగా యుండాలని ప్రభువు కోరుచున్నాడు

## ( The Lord wants us to be Faithful )

మానవుడొకపాపి (రోమా 3 : 23). అతడు రక్షింపబడాలి. అందుకొరకు గాను యేసుప్రభువు క్రూరమైన సిలువపై మరణించాడు (1 పేతురు 2 : 21-24). అయితే తాను పాపినని మానవుడు గ్రహించి విధేయతతో క్రీస్తు నొద్దకు వచ్చినప్పుడు మాత్రమే అతడు రక్షింపబడగలడు. అతడు యేసును గూర్చి నేర్చుకోవాలి (మత్తయి 11:29), ఆయన యందు విశ్వాసముంచాలి (యోహాను 14 : 1), తన పాపముల విషయమై మారుమనస్సు పొందాలి (అపొ. కా. 17 : 30), యేసును దేవుని కుమారుడని ఒప్పుకొనాలి (రోమా 10:10; మత్తయి 10 : 32). పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడాలి (అపొ.కా.

2 : 38; కొలస్స 2 : 12). ఎవరైనను గత పాపములనుండి రక్షింపబడగోరినయెడల వీటిని చేయుట చాల సులభము (మార్కు 16:15, 16). దేవునికి విధేయత చూపుటకు సుముఖముగా లేకున్నా లేదా అబద్ధ బోధను విశ్వసించితేనే తప్ప పై సంగతులను ఎవడు అపార్థము చేసికొనలేడు. అపొస్తలుల కార్యముల గ్రంథములో మార్పు జెందిన వారి సందర్భములను మనము చూస్తే వారందరు ఒకే సత్యానికి లోబడి, రక్షింపబడి, ఒకే సంఘములో చేర్చబడినట్లు మనం చూడగలము (అపొ. కా. 2 : 38, 47). వారేమి చేసారో దానినే ఒకడు ఈనాడు చేస్తే అతడును రక్షింపబడును. క్రీస్తు వారిని రక్షించుటకు ఒకమార్గము, మనలను రక్షించుటకు వేరొక మార్గము కలిగి యుండలేదు.

ఒకడు క్రీస్తుకులోబడి, రక్షింపబడి, సంఘముతో చేర్చబడిన తరువాత యేమిటి? ఒక డొకసారి రక్షింపబడితే అతడు యెల్లప్పుడు రక్షింపబడే యుంటాడని బైబిలు బోధించుచున్నదా? అట్లు కానే కాదు. నిజానికి ఒకడు రక్షింపబడిన తరువాత అతడు రక్షింపబడే యుండాలని ప్రభువు కోరుచున్నాడు. మరల తిరిగి పాపములో బడుటకు మాత్రమే రక్షింపబడియుంటే, అంతకు మించిన ఘోరమైన సంగతి మరొకటి యుండదు. పేతురిట్లనుచున్నాడు: "వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవ జ్ఞానముచేత ఈలోక మాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కుబడి వాటిచేత జయింపబడిన యెడల, వారి కడవరి స్థితి మొదటి స్థితి కంటె మరి చెడ్డదగును. వారు నీతిమార్గమును అనుభవ పూర్వకముగా తెలిసికొని, తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగి పోవుటకంటె, ఆమార్గము అనుభవ పూర్వకముగా తెలియక యుండుటయే వారికి మేలు. కుక్క తనవాంతికి తిరిగినట్టును, కడుగబడిన

పంది బురదలో దొర్లుటకు మళ్లినట్టును అను నిజమైన సామెతచొప్పున వీరికి సంభవించెను" (2 పేతురు 2 : 20-22). ఒకడు రక్షింపబడిన తరువాత తిరిగి పాపములో పడితే అతడు ఇంతకు ముందున్నట్లే నశించిన స్థితిలో యుండునని పేతురు చెప్పుచున్నాడు. నిజానికి అతని పరిస్థితి మొదటి దానికంటె మరి చెడ్డదగును. అతడు ప్రయత్నించి విఫలుడయ్యాడు. అతడు మరల ప్రభువు నొద్దకు వచ్చుటకు అతని గర్వం అడ్డురావచ్చును. అంతేకాదు ఒకసారి రక్షింపబడి మరల పాపములో పడుటవలన అతడు యితరులకు చాల చెడ్డ మాదిరిని చూపించిన వాడగును. అందువలన బలహీనులు అతన్ని బట్టి వెను కాడతారు, మరికొందరు అసలే ముందుకురారు.

అయితే ప్రభువు కోరుచున్న దేమిటి? ఆయన మనలను రక్షించాలని కోరుచున్నాడు, మనము రక్షింపబడే యుండాలని కోరు చున్నాడు. జీవ కిరీటాన్ని పొందుటకు మనం మరణ పర్యంతము నమ్మకముగా యుండాలని ఆయన కోరుచున్నాడు (ప్రక 2 : 10). లేఖనాల్లో దీని ఉదాహరణలు అనేకములున్నాయి. ఇంకో మాటలో పందెపు పరుగులో ప్రవేశిస్తే సరిపోదు. బహు మానము నొందుటకు ఒకడు ఆ పందెపు రంగములో విజయవంతముగా పరుగెత్తాలి (హెబ్రీ 12 : 1, 2; 1 కొరింథీ 9 : 24). మనము ప్రభువు సైన్యములో చేరాలని ఆయన కోరుచున్నాడు. అయితే విజయాన్ని సాధించుటకు మనము విశ్వాస సంబంధమైన మంచి పోరాటమును పోరాడాలి (ఎఫెసీ 6 : 10-17; 1 తిమో 6 : 12). మనము దేవునినే ముందుంచాలని లేఖనములు చెప్పుచున్నవి (మత్తయి 6 : 33). మనము అంతమువరకు సహించాలి (మత్త 24 : 13). క్రీస్తును దినదినము వెంబడించాలి మరియు ఆయన సేవకులవలె ఆయన మరల వచ్చినప్పుడాయనను కలసికొనుటకు ఎల్లవేళలా సిద్ధపడియుండాలి. అపొ.

యోహాను యిట్లు చెప్పుచున్నాడు: "జీవవృక్షమునకు హక్కు-గలవారై గుమ్మముల గుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు" (ప్రక 22 : 14).

చివరిగా, నమ్మకముగా యుండుట అంటే మనము నమ్మదగిన వారమని, ఆయన చిత్తాన్ని జరిగించుటకు ఆసక్తిగలవారమని దాని భావం. క్రైస్తవు డెల్లవేళలా నమ్మదగినవాడు, అతని ప్రవర్తన సరళమైనది. వారంలో మొదటి దినాన్న అతడు దేవుని ఆరాధిస్తాడు, నైతికంగా మంచివాడు, తన పొరుగువానిని ప్రేమిస్తాడు, అన్ని విషయాల్లోను మంచి మాదిరిని నెలకొల్పుతాడు, నశించినవారిని ప్రభువు కొరకు సంపాదిస్తు యుంటాడు. అతడు మానవుడే, దేవుని దృష్టిలో పాపియే, పొరబాట్లు చేయువాడే. అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము: అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1 : 7).

ప్రభువు తనవారిని, అంతము వరకు నమ్మకముగా యున్న వారిని రక్షించును. ఎవరైతే ఆరంభించి వెనుకాడారో, అపనమ్మకముగా యున్నారో అట్టివారిని ఆయన వెలుపలి చీకటిలో పడవేయును. అది నిత్య శిక్షయే (మత్త 13:41). ప్రభువుదగ్గర విలపించేవారుకూడ లేకపోలేదు. అయితే ప్రభువు ఇట్లు చెప్పుచున్నాడు: "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడు పరలోకరాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును. ఆ దినమందు అనేకులు నన్ను చూచి ప్రభువా! ప్రభువా మేము నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా ? నీ నామమున ప్రవచింపలేదా ? నీ నామమున అనేక అద్భుతములు చేయలేదా ?

అని చెప్పుదురు. అప్పుడు నేను మిమ్మును ఎన్నడు ఎరుగను; అక్రమము చేయువారలారా, నాయొద్దనుండి పొండని వారితో చెప్పుదును" (మత్త 7 : 21-23).

నీవు క్రైస్తవుడవా? నీవు నమ్మకమైన క్రైస్తవుడవా? యేసుకు నీవు కావాలి. అయితే నీ జీవితకాలమంతయు ఆయనకు నీవు కావాలి. నమ్మకముగా యుండుట అంటే అర్థమదియే. అట్టి నమ్మకత్వమే నిత్యత్వంలో నీకు నిత్యజీవ కిరీటాన్ని బహూకరించునట్టిది.

---

కొండమీద ప్రసంగము-8

## నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు

### (Blessed are the Persecuted for Righteousness Sake)

(మత్తయి 5 : 10-12)

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములో అనేక ధన్యతలను గూర్చి చెప్పారు, చివరిగా ఆయన ఇట్లన్నారు: "నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు. పరలోక రాజ్యము వారిది. నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి. పరలోకమందు మీ ఫలము అధికమగును. ఈలాగున వారు మీకు పూర్వమందుండిన ప్రవక్తలను హింసించిరి" (మత్తయి 5: 10-12).

తన శిష్యులు హింసింపబడతారని క్రీస్తు ఇక్కడ ప్రవచించారు. ఆయన చెప్పిన రీతిగానే వారికి జరిగినది. క్రీస్తుకొరకు మొదటి హత సాక్షియైన స్తెఫను కాలమునుండి నేటివరకు క్రైస్తవులు హింసింపబడుచునే యున్నారు. వారు చెరసాలలో వేయబడ్డారు. హింసింప

బడ్డారు. ఖడ్గముచేత వధింపబడ్డారు. సింహముల బోనులలో పడవేయ బడ్డారు. వారు దీవించబడినవారు. వారు హింసలను సహించారు, క్రీస్తు యేసుకొరకు, ఆయన నీతికొరకు హింసింపబడ్డారు. అట్టివారిదే పరలోకరాజ్యము అని ప్రభువు చెప్పారు.

యేసు ప్రభువు చెప్పిన ధన్యతలలో మొదటిది పరలోక రాజ్యముతో ఆరంభమైనది. "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు, పరలోక రాజ్యము వారిది". ఆఖరి ధన్యతకూడ పరలోక రాజ్యముతో అంతమయినది. "నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు, పరలోక రాజ్యము వారిది". ఈ ధన్యతలలో పరలోక రాజ్యముయొక్క చట్టము వివరింపబడినది. దాని పౌరుల తత్వము వర్ణింపబడినది. ఈ ధన్యతలు గలవారు పరలోక రాజ్య పౌరులు. ఆత్మ విషయమై దీనులైనవారు మాత్రమే దానిలో ప్రవేశిస్తారు. క్రీస్తుకొరకు ఎవరైతే హింసింపబడ్డారో వారికి దానిలో స్థానము భద్రము చేయబడినది. ఆయన త్రాగిన గిన్నెలోనిది వారును త్రాగిరి, ఆయన పొందిన బాప్తిస్మమును వారును పొందిరి.

క్రీస్తు సిలువయొద్ద ఆరంభమైన హింసాకాండము నేటికిని అంతము కాలేదు. నేటికిని అది అనేక గృహాల్లో దర్శన మిచ్చుచున్నది. పాఠశాలలలోను, గ్రామముల యందును క్రీస్తుకొరకు హింసలు, అవమానములు పొందుచున్న వారు లేకపోలేదు. నేడు పరిశుద్ధత అన్ని ప్రదేశముల యందును మన్నన పొందినది కాదు. అక్రమముతోను, అవినీతితోను నిండుకొని యున్న నేటి ప్రపంచములో క్రీస్తు నందలి విశ్వాసమును బట్టి పవిత్రంగా నడుచుకొనువారు హేళనచేయబడుచున్నారు. "నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు" అని యేసుప్రభువు ముందుగానే హెచ్చరించారు. అట్టి సమయాల్లో వారు సంతోషించి,

ఆనందించాలి. ఏలయనగా వారు ప్రభువుకు చెందినవారు. ఎవరైతే నీతి యదార్థతలకొరకు జీవిస్తారో అట్టివారు హింసలు పాలగుదురని ఈ ధన్యత చెప్పుచున్నది. "క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రతుకను ద్దేశించువారందరు హింస పొందుదురు" (2 తిమో 3:12).

యేసుప్రభువు చెప్పిన ఈ ధన్యతను ఆయన శిష్యులు, మరియు ఆయన ప్రసంగమును వినుచున్నవారు గ్రహించుకొనే యున్నారు. అపొ. పేతురు వ్రాసిన పత్రికలలో ఈ ధన్యతలోని భావము మనకు పదేపదే కన్పడుచున్నది పేతురు ఇట్లనుచున్నాడు: ""మీరు మంచి విషయములలో ఆసక్తి గలవారైతే మీకు హాని చేయువాడెవడు? మీరొకవేళ నీతినిమిత్తము శ్రమపడినను మీరు ధన్యులే" (1 పేతురు 3 : 13-14). మరల "క్రీస్తు నామము నిమిత్తము మీరు నిందపాలైన యెడల మహిమాస్వరూపియైన ఆత్మ అనగా దేవుని ఆత్మ మీమీద నిలుచుచున్నాడు గనుక మీరు ధన్యులు" అని అతడు వ్రాసాడు (1 పేతురు 4 : 14).

## శ్రమలలో క్రీస్తు మాదిరి

క్రీస్తును వెంబడించువారి మీదికి శోధనలు మూడు రకములుగా వచ్చునని ఆయన చెప్పారు. జనులు మిమ్మును నిందిస్తారు, హింసిస్తారు, అబద్ధముగా చెడ్డమాటలు పలుకుతారు అని ఆయన చెప్పారు. నిజానికి యేసుక్రీస్తు ఈ విషయాలన్నిటిలోను కూడ శ్రమ అనుభవించారు. క్రీస్తుకూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగుజాడల యందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచి పోయెను అని పేతురు వ్రాసాడు (1 పేతురు 2 : 21). క్రైస్తవులు పొందే శ్రమలనుగూర్చి కూడ పేతురు తన మొదటి పత్రికలో హెచ్చరించాడు. "ప్రియులారా, అన్యజనులు మిమ్మును ఏ విషయములో దుర్మార్గులని దూషింతురో, ఆ విషయములో వారు మీ సత్క్రియలను చూచి

దేవుని మహిమపరచునట్లు వారి మధ్యను మంచి ప్రవర్తన గల వారై యుండవలెనని బతిమాలుకొనుచున్నాను" (1 పేతురు 2:12). మరల "ఎవడైనను అన్యాయముగా శ్రమ పొందుచు, దేవునిగూర్చిన మనస్సాక్షి కలిగి దుఃఖము వహించిన యెడల అది హితమగును" (2:19). "ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరి గనుక కీడుకు ప్రతి కీడైనను, దూషణకు ప్రతి దూషణయైనను చేయక దీవించుడి" (3 : 9). "మీ హృదయములయందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుడి; అప్పుడు మీరు దేనివిషయమై దుర్మార్గులని దూషింపబడుదురో దాని విషయమై క్రీస్తునందున్న మీ సత్ప్రవర్తన మీద అపనింద వేయువారు సిగ్గుపడుదురు. కీడుచేసి శ్రమపడుటకంటె మేలు చేసి శ్రమపడుటయే మంచిది" (3:13-19). "ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహాశ్రమను గూర్చి మీకేదో యొకవింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి. క్రీస్తు మహిమ బయలుపరచబడినప్పుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము క్రీస్తు శ్రమలలో మీరు పాలివారై యున్నంతగా సంతోషించుడి. క్రీస్తు నామము నిమిత్తము మీరు నిందపాలైన యెడల మీరు ధన్యులు" అని పేతురు క్రైస్తవులను హెచ్చరించాడు (1 పేతురు 4:12-14).

నా నిమిత్తము మీరు హింసింపబడుదురు అని యేసుప్రభువు హెచ్చరించారు. ఈ మాటలను అపొస్తలులు, మొదటి శతాబ్దపు క్రైస్తవులు బాగుగా గ్రహించుకొన్నారు. క్రీస్తుతో పరిపూర్ణ సహవాసము ఏర్పడిన తరువాత "నా బ్రతుకుమూలముగానైనను సరే, చావుమూలముగానైనను సరే క్రీస్తు నా శరీరమందు ఘనపరచబడునని" క్రైస్తవుడు తలుస్తాడు (ఫిలిప్పీ 1:19). అతడు క్రీస్తునందు విశ్వసించుట మాత్రమే గాక ఆయన పక్షమున శ్రమపడుటయు మేలని

తలంచును (ఫిలిప్పీ 1:29). పేతురు యోహానులను యూదుల పెద్దలు పట్టుకొని హింసించి విడుదల చేసిన తరువాత యేసు నామము కొరకు అవమానమును పొందుటకు పాత్రులని యెంచబడినందున వారు సంతోషించుచు మహాసభనుండి వెళ్ళిపోయిరి (అపో.కా. 5:41).

## నీతి కొరకు హతసాక్షులు

మొదటి శతాబ్దములోని క్రీస్తు సంఘము అనేక హింసలకు గురి ఆయెను. క్రీస్తుయొక్క అపొస్తలు లందరు, యోహాను ఒకడుతప్ప అందరు హింసింపబడిరి. ఘోరముగా చంపబడిరి. రాజైన హేరోదు యోహాను సహోదరుడైన యాకోబును ఖడ్గముతో చంపించెనని అపో.కా. 12వ అధ్యాయములో చదువగలము. అతడు క్రీ॥శ॥ 44వ సంవత్సరములో చంపబడెను. ఫిలిప్పు కొరడాలతో కొట్టబడెను, చెర సాలలో వేయబడెను మరియు క్రీ॥శ॥ 54వ సంవత్సరములో హేలియో పోలీస్ అను పట్టణంలో సిలువ వేయబడి చంపబడెను. మత్తయి పార్తియలోను, ఐతియోపీయలోను సువార్త ప్రకటించిన తరువాత ఐతియోపీయలోని నదాబ అను పట్టణంలో హత్యగావించబడెను. చిన్న యాకోబు అను మరియొక అపొస్తలుడు తన 94వ యేట యూదులచే చంపబడెను. వారతని కొట్టిరి, రాళ్లు రువ్విరి, పెద్ద బండతో అతని తల బద్దలు గొట్టిరి. అపో. పేతురు తలక్రిందులుగా సిలువ వేయబడి చంపబడెను. క్రీ॥శ॥ 72వ సంవత్సరములో తద్దయి అనబడిన యూదా Edessa అను పట్టణంలో సిలువవేయబడి చంపబడెను. బర్తొలొమయి భారతదేశమునకు వచ్చి సువార్త ప్రకటింపగా విగ్రహా రాధకులు అతనిని ఘోరముగా కొట్టి చంపిరి. తోమా పార్తియలోను, భారతదేశంలోను సువార్త ప్రకటించెను. గాని భారతదేశంలో అతనిని బళ్ళెములతో పొడిచి చంపిరి. జెలోతే అనబడిన సీమోను మారుతేనియలోను, ఆఫ్రికాలోను, ఇంగ్లాండులోను సువార్త ప్రకటించెను.

గాని క్రీ॥శ॥ 74వ సంవత్సరములో సిలువ వేయబడి చంపబడెను. మత్తీయ అను అపొస్తలుడు యెరూషలేములో రాళ్లు రువ్వి తల నరకబడి చంపబడెను. అంద్రెయ ఆసియాలో సువార్త వ్యాపింప జేసెను. **Edessa** అను పట్టణంలో సిలువ వేయబడి చంపబడెను. అపో॥ యోహాను "దేవుని వాక్యము నిమిత్తమును - యేసును గూర్చిన సాక్ష్యము నిమిత్తమును పద్మాసు ద్వీపములో పరవాసిగా" డొమేషియన్ అను చక్రవర్తి వలన బహిష్కరింపబడెను (ప్రక 1:9). అపొస్తలులందరిలో యోహాను ఒక్కడే సహజమరణము నొందెను. అపో. పౌలు శిరచ్ఛేదనము గావించబడెను. వీరేగాక క్రైస్తవ్యము ఆరంభ దినాల్లో వేలకొలది ప్రజలు ఘోరముగా హింసింపబడిరి. (Ref. Hugo McCord-Happiness Guaranteed).

క్రీస్తుకొరకు హతసాక్షులైన వారందరు, "నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు" పరలోక రాజ్యము వారిది" అని తమ ప్రభువు చెప్పిన మాటలను ప్రేమించి సంతోషముగా తమ ప్రభువు కొరకు ప్రాణముల నర్పించారు. ప్రభువు చేసిన వాగ్దానములయందు విశ్వసించినవారై శ్రమలతో కూడిన గొప్ప పోరాటమును వారు సహించారు (హెబ్రీ 10 : 32). "వారికి మరి శ్రేష్టమైనదియు స్థిరమైనట్టిదియునైన స్వాస్థ్యమున్నదని యెరిగి" ఈ లోకంలో నిందలను, బాధలను, హింసలను, చివరకు మరణాన్ని సహించారు (హెబ్రీ 10:34). "అంతేకాదు శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగ జేయునని యెరిగి. శ్రమలలో సహితము ప్రభువును మహిమపరచారు" (రోమా 5:3-4)

నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు, పరలోక రాజ్యము వారిది. మనము క్రీస్తును వెంబడించునప్పుడు సిలువనే ఆయన వాగ్దానము చేసాడు. అయితే ఈలోకంలో ప్రభువు కొరకు, ఆయన వాక్యం కొరకు మనం శ్రమలను సహించిన వారమైతే ఆయనతో కూడ ఏలు

దుము అని చెప్పబడింది (2 తిమో 2:12). నీకెన్ని శ్రమలు, హింసలు వచ్చినా, ప్రభువుకొరకు మరణ పర్యంతము నమ్మకముగా యుండుము. అట్టివారికే ఆయన నిత్యజీవ కిరీటాన్ని బహూకరిస్తాడు (ప్రక 2:10).

—జాషువా గూటం,

—o—

## క్రీస్తునందు నూతన ప్రజలు

## ( New People in Christ )

"కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ 5 : 17).

క్రొత్త సంగతులంటే అందరికీ సరదా. క్రొత్త శిశువయినా, క్రొత్త ఇల్లయినా, క్రొత్త దుస్తులయినా వాటిలో ఉన్న క్రొత్తదనాన్ని బట్టి క్రొత్త సంగతులు వింతగానే ఉంటాయి. క్రొత్త అను మాటకు గ్రీకులో నియోస్ అని, కైనోస్ అని రెండు మాటలున్నాయి. నియోస్ అనగా కాలమాన ప్రకారము క్రొత్తది అను భావము - క్రొత్త శిశువు. కైనోస్ అనగా క్రొత్త గుణము లేక లక్షణము. పాత యిల్లును క్రొత్తగా మార్చితే ఈ మాట వాడవచ్చు. పాత కారులో క్రొత్త ఇంజనును అమర్చి దాన్ని క్రొత్తగా చేయవచ్చును. యిల్లు, కారు కాలాన్ని బట్టి క్రొత్తవి కాదుగాని వాటి లక్షణాన్ని బట్టి క్రొత్తగా చేయబడినవి. వాటికి నూతన జీవం ప్రసాదించబడింది. అవి పునర్నిర్మించబడినవి.

కైనోస్ అనే మాటను 2 కొరింథీ 5:17లో పౌలు ఉపయోగించాడు. గనుక ఈ వచనము "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన స్వభావము గలవాడు. పాతవి గతించెను. ఇదిగో నూతన స్వభావముగల సంగతులు" అని సహజంగా అనువదించబడాలి. మనము కాలములో నూతనంగా ఉద్భవించగలమని పౌలు చెప్పుటలేదు గాని మనం నూతన స్వభావము గలవారిగ ఆరంభించ

గలము. ఇంకో మాటలో గతంలో నీ జీవితమెట్లున్నను, అది నూతన పరచబడవచ్చును. నీవు అపజయాన్ని ఎదుర్కొనుచున్న యెడల విజయాన్ని సాధించవచ్చును, నీవు ఆత్మీయంగా మృతుడవైతే సజీవుడవు కాగలవని అతడు చెప్పుచున్నాడు.

క్రీస్తుద్వారా నూతన పరచబడిన ప్రజల సమూహామే క్రీస్తు సంఘము. వారు పాపములో వచ్చినవారై యుండగా సువార్త ద్వారా తిరిగి బ్రతికింపబడినవారు. పౌలు కొలస్సయిలోని సంఘమునకిట్లు చెప్పాడు: "మరియు అపరాధముల వలనను, శరీరమందు సున్నతి పొందక యుండుటవలనను మీరు మృతులై యుండగా... దేవుడు మన అపరాధము లన్నిటిని క్షమించి ఆయనతో కూడ మిమ్మును జీవింపజేసెను" (కొలస్స 2:13-15). క్రైస్తవులకు క్రీస్తునందు నూతన జీవ మనుగ్రహింపబడినను, పాపమువలన అది దొంగిలించబడకుండు నిమిత్తము వారి నూతన జీవమునందు శ్రద్ధ కలిగి యుండాలి. పౌలు ఎఫెసీయుల నిట్లు హెచ్చరించాడు: "కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశల వలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలుకొని మీ చిత్త వృత్తియందు నూతన పరచబడినవారై నీతియు యథార్థమైన భక్తియు గలవారై దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను" (ఎఫెసీ 4:22-24).

స్వభావములో నూతనమైన ఈ జీవితాన్ని దేవుడు ఎట్లు మన కిచ్చును? అని మనం అడుగవచ్చు లేదా ఇంకో మాటలో, క్రీస్తులో మనలను నూతన సృష్టి చేయుటకు దేవుడు వినియోగించు పద్ధతి యేది? అని మనం అడుగవచ్చును. రోమా 6వ అధ్యాయములో ఈ ప్రశ్నకు పౌలు జవాబిచ్చుచున్నాడు. రోమా 1-3 అధ్యాయములలో విధేయతగల విశ్వాసము వలన ప్రజలు దేవుని యెదుట నీతి

మంతులుగా ఎట్లు తీర్చ బడుదురో చెప్పాడు. రోమా 4వ అధ్యాయ ములో విశ్వాసము అబ్రాహామును దేవుని యెదుట ఎట్లు నీతిమంతు నిగా చేసెనో చెప్పాడు. రోమా 5-8 అధ్యాయాల్లో రక్షణవలన కలుగు దీవెనలను అతడు వివరించాడు: మనకు దేవునితో సమాధా నము (5); మనం క్షమింపబడుదుము (6); మనం మోషే ధర్మ శాస్త్రముక్రింద గాక, విధేయతగల విశ్వాసమును బట్టి యున్నాము (7); మరియు జీవము కలిగి యున్నాము (8).

రోమా 6వ అధ్యాయములో క్రీస్తునందు దేవుడు పాపము నుండి మనకు విడుదల నెట్లు యిచ్చాడో వివరించాడు. మరియు దేవుడు మనలను ఒక నూతన జనాంగముగ ఎట్లు చేసాడో తెలియపరచాడు. క్రీస్తునందు దేవుడు మనలను నూతన ప్రజలుగా ఎట్లు చేస్తాడో చూద్దాం. పౌలు చెప్పినదాన్ని బట్టి ఆ పద్ధతిని రెండు దశలుగా చేయ వచ్చును. సీతాకోక చిలుక జీవనంలో మూడు దశలుంటాయి. అది గుడ్డుగాయున్న దశ, లార్వా దశ, ప్యూపా దశ; అట్లే మనం క్రీస్తులో నూతన పరచబడడానికి మూడు దశలు గమనించుకోవచ్చును. ఈ మూడింట్లో ఏ ఒక్కటి సంభవించకపోయినా క్రమాన్ని తప్పిన వార మవుదుము. నీవు సంపూర్తిగా క్రీస్తులో నూతన పరచబడాలంటే నీవు దేవుని పునర్నిర్మాణ పద్ధతికి లోబడాలి. అయితే దేవుడొక నూతన వ్యక్తిని ఎట్లు చేస్తాడు?

## ప్రథమ దశ : ఎడబాటు

నూతన జీవిత యాత్రలో మొదటి దశ ఎడబాటు. దేవుని పునర్నిర్మాణ కార్యక్రమములో పాపమునుండి ఎడబాటు అత్యావు సరం. పౌలు ఇట్లు చెప్పాడు: "ఆలాగైన ఏమందుము? కృప విస్తరించ వలెనని పాపమందు నిలిచియుందుమా? అట్లనరాదు. పాపము విష యమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించు

దుము?" (రోమా 6:1, 2). 'పాపము విషయమై చనిపోయిన మనము' అను మాటలను జాగ్రత్తగ గమనించుము. రోమా 5వ అధ్యాయములో పౌలు దేవుని కృపను వర్ణించాడు. పాపము ఎక్కడ విస్తరించెనో అక్కడ కృప అపరిమితముగా విస్తరించెనని అతడు చూపించాడు (5:20, 21). తన కృపచేత దేవుడు మన పాప సమస్యను అధిగమించాడు. తద్వారా ఆయన ఘనతను నిరూపించాడు. ఈ సత్యాన్ని కొందరు అపార్థము చేసికొనవచ్చును. "కృప విస్తరించునట్లు మనము పాపములోనే యుండాలి. మన పాపం అధికమయ్యేకొలది ఆయన కృప అధికమవుతాది. ఆయన గొప్పతనం మరింత బయలుపడతాది" అని వారు తలంచవచ్చు. పౌలు ఇట్టి సమస్య ఉద్భవిస్తాదని ఎరిగినవాడై రోమా 6వ అధ్యాయపు ఆరంభములోనే ఒక ప్రశ్నను రేకెత్తించాడు: "కృప విస్తరించవలెనని పాపమందు నిలిచియుందుమా? "అట్లనరాదు" అని అతడే ఖచ్చితంగా జవాబిచ్చాడు. అటు తరువాత పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట దానిలో ఏలాగు జీవింతుము?" అని అతడడిగాడు. ఇంకో మాటలో, క్రైస్తవుడు పాపములో జీవించుట సరియైనదికాదు, ఏలయనగా అతడు దాని విషయమై మృతుడైనవాడు.

క్రీస్తులోనికి బాప్తిస్మము పొందేవరకు పాపము విషయమై మనము చనిపోయినట్లు నిర్ధారణకాదని పౌలు చెబుతున్నాడు. రోమా 6 : 4లో మనము పాపము విషయమై ఆత్మీయముగా చనిపోతిమని చెబుతున్నాడు. అయితే పాపము విషయమై చనిపోవుటకుముందు విశ్వాసము, మారుమనస్సు, యేసును ఒప్పుకొనుట సంభవించాలి. పాపముల విషయమై చనిపోవుట దేవుని మూలముగా క్రీస్తునందలి విశ్వాసమువలనను (అపో. కా. 15 : 9), మారుమనస్సువలనను (1 థెస్స 1 : 9), యేసే ప్రభువని ఒప్పుకొనుట వలనను (రోమా 10 : 10) సంభవించును.

మనము క్రైస్తవుల మవునప్పుడు మూడు ప్రాముఖ్యమైన మార్పులు సంభవించును. మొదటిది హృదయ మార్పు. హృదయం పవిత్రపరచబడతాది. ఈ మార్పు క్రీస్తునందలి విశ్వాసమువలన కలుగును. పేతురు అన్యజనులను గూర్చి ఇట్లు చెప్పాడు: "వారి హృదయములను విశ్వాసమువలన పవిత్రపరచి మనకును వారికిని ఏ భేదమైనను కనుపరచలేదు" (అపో. కా. 15 : 9). రెండవది జీవిత మార్పు, పాపమును విసర్జించిన జీవితము. మారుమనస్సు చిత్త మార్పు, దాని ఫలితం జీవితంలో మార్పు (అపో. కా. 11 : 8). మూడవది మన పలుకుబడిలో మార్పు. దానిలో మనవిశ్వాసాన్ని, నమ్మకాన్ని ప్రకటిస్తాం. యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనుటలో ఈ మార్పు సంభవించును (రోమా 10 : 10). నాలుగవది, మన స్థితిలో కలుగు మార్పు. తద్వారా ఒకడు క్రీస్తులో ప్రవేశించును. యిది బాప్తిస్మములో సంభవించును (రోమా 6 : 3). ఈ నాలుగింటిలో మొదటి మూడింటిని "పాపము విషయమై చనిపోవుట" అను మాటలలో పౌలు యిమిడ్చాడు. నాలుగవ మార్పు రోమా 6 : 4లో ప్రత్యేకముగా చెప్పబడినది. ఈ నాలుగు మార్పుల ననుభవించువరకు ఒకడు పాపము విషయమై సంపూర్తిగ మరణించినవాడు కాదని పౌలు యొక్క భావము.

తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామములోనికి బాప్తిస్మము పొందిన కొందరిని మన మందరము ఎరుగుదుము. అయితే బాప్తిస్మము పొందిన తరువాత క్రీస్తులో యున్న నూతన జీవితాన్ని వారు ప్రదర్శించరు. బాప్తిస్మము పొందిన తరువాత కూడ వారిలో వవిధమైన మార్పులేక తమ పాత పాప జీవితంలోనే కొనసాగుచుందురు. వారిని గమనిస్తూ వారు నూతన జీవములో ఎందుకు ప్రవేశింపలేక పోయారో యని మనం ఆలోచించుచుండ వచ్చును. రోమా 6వ అధ్యాయములో పౌలు దీనికి ఒక జవాబిచ్చాడు: "వారు పాపము

నుండి విడుదల పొందారా ? దేవుని నూతన నిర్మాణ పద్ధతికి వారు సంపూర్ణముగా విధేయులయ్యారా ?". ఈ ఎడబాటు దశను ఏకారణం చేతనైనను అనుసరించకపోతే, ఒకడు క్రీస్తులో యున్న నూతన జీవములో ప్రవేశించలేడు.

క్రీస్తునందు యథార్థమైన విశ్వాసముతో, మారుమనస్సు పొంది, యేసే ప్రభువని ఒప్పుకొనుచు పాపమునుండి ఎడబాటు పొందే దశను నీవు అనుభవించావా ?

## రెండో దశ : రక్షణ

దేవుని నూతన నిర్మాణ పద్ధతిలో రెండో దశ రక్షణ. ఈ దశలో మనము క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరములోనికి తీసికొనిరాబడుదుము. ప్రాధాన్యముగా యిది బాప్తిస్మము చుట్టు ప్రదక్షణ యగును. పౌలు రోమా 6:3, 4లో ఇట్లు వ్రాసాడు: "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి". బైబిలులో యున్న ఈ రెండు క్లుప్త వచనాల్లో బాప్తిస్మమునుగూర్చి చెప్పబడినంత మరెక్కడ కనుగొనగలము? ఈ రెండు వచనాలలోను బాప్తిస్మమునుగూర్చి నాలుగు ప్రముఖమైన సత్యములు విశదమగుచున్నవి.

మొదటిగా బాప్తిస్మము 'క్రీస్తులోనికి' యని పౌలు చెప్పాడు. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము" అని అతడు చెప్పాడు. బాప్తిస్మములో దేవుని కృపవలన క్రీస్తుయొక్క ఆత్మీయ

శరీరమగు సంఘములోనికి మనము తేబడితిమి. క్రీస్తు యెడల మన విశ్వాస సంబంధమైన ప్రకంపన బాప్తిస్మము (గలతీ 3 : 26, 27; 2 తిమో 2 : 10). రెండవదిగా, మనము 'ఆయన మరణములోనికి' బాప్తిస్మము పొందితిమని పౌలు చెప్పాడు. క్రొత్తనిబంధన బాప్తిస్మములో క్రీస్తు యొక్క మరణమువలన సంప్రాప్తమైన ఆశీర్వాదముల నొద్దకు మనము తేబడుదుము. ఆయన మరణములో యేసు మన కేమైతే లభ్యపరచాడో వాటిని బాప్తిస్మములో మనము పొందుదుము.

మూడవదిగా, మనము బాప్తిస్మములో పాతిపెట్టబడితిమని పౌలు వర్ణించాడు. "మనము బాప్తిస్మమువలన ... ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి". క్రొత్తనిబంధన బాప్తిస్మము ఒక సమాధి లేదా ముంచబడుట. బాప్టిజో అను గ్రీకు పదమునుండి బాప్తిస్మమను మాటను తెలుగున కనువదించారు. దీనికి ముంచుట యని అర్థము. ఈ వాక్యభాగములోను, కొలస్స 2 : 12 లోను పౌలు బాప్తిస్మమును వర్ణించిన భావము యిదే. గనుక క్రొత్తనిబంధన బాప్తిస్మము నీటిలో పాతిపెట్టబడుట, ముంచుట యని మనకు నిర్ధారణ యగుచున్నది.

నాలుగవదిగా మనము పాపముల విషయమై ఆత్మీయముగా మృతి పొందుటకుగాను బాప్తిస్మము పొందితిమని పౌలు వ్రాసాడు. "కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (4వ). బాప్తిస్మములో పాపము యెడల మన మృతి నిర్ధారణయగును. విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు బాప్తిస్మముల ద్వారా, "మన మికను పాపము

నకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థక మగునట్లు మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము" (రోమా 6:6, 7).

క్రీస్తు జీవితములోని ప్రాముఖ్య ఘట్టము బాప్తిస్మమిచ్చు యోహానుచే ఆయన బాప్తిస్మము పొందుటయే. ఆయన సువార్త పరిచర్యకు ముందు బాప్తిస్మము పొందెను, శోధింపబడెను. యోహానుచే యేసు బాప్తిస్మము పొందుటకు యొర్దాను నదియొద్దకు వెళ్లినప్పుడు "నేను నీచేత బాప్తిస్మము పొందవలసిన వాడనై యుండగా నీవు నాయొద్దకు వచ్చుచున్నావా? అని ఆయనను నివారింపజూచెను గాని యేసు-ఇప్పటికి కానిమ్ము; నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను" (మత్తయి 3:14,15). బాప్తిస్మపు నీటిలోనుండి యేసు లేచినప్పుడు రెండు ప్రముఖ సంఘటనలు జరిగెను. పరలోకమందున్న ఆయన తండ్రి మొట్టమొదటిగా ఆయన తన కుమారుడని ప్రకటించెను. "ఈయన నా ప్రియ కుమారుడు; ఈయన యందు నేనానందించుచున్నానని" ఆయన చెప్పెను (మత్తయి 3: 16). నీవెవని మీద ఆత్మ దిగి వచ్చుటచూతువో ఆయనే దేవుని కుమారుడని యోహానుకు ఇంతకుముందే తెలియజేయబడెను (యోహాను 1:33). గనుక యేసుకు బాప్తిస్మ మిచ్చిన నాటి నుండి ఆయనే దేవుని కుమారుడని యోహాను సాక్ష్యమిచ్చుచుండెను (యోహాను 1 : 29). యేసు యొక్క బాప్తిస్మము ఆయన సువార్త పరిచర్యకు నాంది ఆయెను.

యేసు పొందిన బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యత మన బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యతను గుర్తుకు తెచ్చుచున్నది. మన బాప్తిస్మము ఎంత ప్రాముఖ్యమైన ఘట్టమో ఆలోచించు. మనము క్రీస్తు శరీరములోనికి, ఆయన సంఘములోనికి బాప్తిస్మము పొందక్షిప్తుని

పౌలు చెప్పుచున్నాడు. ఆయన మరణములో ఐక్యత పొందుటకు, దాని లబ్ధిని పొందుటకు మనము తేబడితిమి. మన పాపముల మరణము నిమిత్తమై బాప్తిస్మము పొందితిమి. మననుండి పాప పురుషుడు ఎడబాయుచుండగా మనము నూతన జీవము కలిగి నడుచుకొనునట్లు ఆ నీటి సమాధినుండి లేపబడితిమి.

దేవుని ఈ పునర్ నిర్మాణ దశగుండా నీవు వెళ్ళావా ? నీవు క్రీస్తులోనికి, ఆయన మరణములోనికి, నీ పాపముల మరణములోనికి బాప్తిస్మము పొందితివా ?

## మూడో దశ : నిలకడగా యుండుము

దేవుని నూతన నిర్మాణ పద్ధతిలో మూడోది నిలకడగాయుండు దశ. మన మొకసారి తిరిగి నిర్మింపబడినప్పుడు, తిరిగి నిర్మింపబడిన వారుగానే యుండాలి. దేవుడు మనకు నూతన జీవాన్ని ప్రసాదించ గలడు గాని దాన్ని మనం జీవించాలి. ఆయన మనలను సంకుచిత మైన, యిరుకైన మార్గములో ప్రవేశింప జేస్తాడు గాని ఆమార్గము లోనే మనం పయనించాలి. రోమా 6వ అధ్యాయములోని మిగతా వచనాల్లో క్రీస్తులో మనకున్న నూతన జీవము యొక్క నాలుగు లక్షణాలను పౌలు తెలియబరచాడు. ఈ నూతన జీవ లక్షణములను మనం అనుదినం అలవరచుకొనాలి.

మొదటిగా, క్రీస్తులో మనకొక నూతన విముక్తి ఉన్నదని పౌలు చెప్పాడు. అది పాపమునుండి పొందిన విడుదలయే. "చనిపోయిన వాడు పాప విముక్తుడని తీర్పు పొందియున్నాడు" (రోమా 6 : 7). ఎవడైనను "నేను విడుదల పొందగోరుచున్నాను" అని చెప్పిన యెడల, "దేనినుండి విడుదల?" అని నేనడుగుదును. తానుచేయు పని నుండి విడుదలా ? నియమాలనుండి విడుదలా? నిద్రనుండి విడుదలా?

దేనినుండి విడుదల ? యని మనం అడుగుదుము. పౌలు విడుదల, విముక్తి, స్వాతంత్ర్యములను గూర్చి రోమా 6లో చర్చించాడు. క్రీస్తులో మనము పాపమునుండి విముక్తుల మయ్యాము. దానియొక్క అపరాధమునుండి విడుదల్ల పొందాము. అని అతడు చెప్పాడు (రోమా 3 : 24; 6 : 3). పాపము యొక్క పట్టునుండి (6:17), దాని మరణము నుండి విడుదలయ్యాము (6 : 21).

రెండవదిగా, ఈ నూతన జీవము నూతన సహవాసముతో మిళితమై యుండునని పౌలు చెప్పాడు. మనము దేవునితో సహవాసము కలిగియుంటాము. "అటువలె మీరును పాపము విషయమై మృతులు గాను, దేవుని విషయమై క్రీస్తు యేసునందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి" (రోమా 6:11). ఈ వచనములో రెండు తార తమ్యాలు కానవగును. ఒకటి దానిలో దాగియున్నది, మరొకటి ప్రక టింపబడి యున్నది. నీవు క్రైస్తవుడవు కాకముందు పాపము విష యమై జీవిస్తు దేవుని విషయమై మృతుడవైతివనేది దానిలో దాగి యున్న సత్యము. అయితే నీవు క్రైస్తవుడవైనప్పుడు దేవుని యందు సజీవుడవై పాపము యెడల మృతుడవైతివనేది ప్రకటింపబడిన సత్యము. క్రీస్తునందు నీవొక నూతన సహవాసములోనికి, దేవునితో నూతన సంబంధము కలిగియుండుటకు తేబడితివి. ప్రార్థించడానికి నీకొక పర లోక తండ్రి యున్నాడు. పరలోక రక్షకుడైన క్రీస్తుద్వారా నీవు ఆయన నిప్పుడు ప్రార్థించగలవు. దేవుడనుగ్రహించు సహవాసము, ఆశీర్వాదములు, వాగ్దానములు, ఆత్మీయ జీవము మొదలైన వాటి కిని, ఆయనయొక్క ఉనికికిని నీవు ఇప్పుడు సజీవుడవైతివి.

మూడవదిగా, క్రీస్తునందలి నూతన జీవితము, నూతన ఫలముల ద్వారా ప్రదర్శించబడ కాదని పౌలు వివరించాడు: "అప్పటి క్రియల వలన మీ కేమి ఫలము కలిగెను? వాటిని గురించి మీరిప్పుడు సిగ్గుపడు

చున్నారుగా? వాటి అంతము మరణమే, అయినను ఇప్పుడు పాపము నుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము. దాని అంతము నిత్యజీవము" (రోమా 6 : 21, 22).

క్రైస్తవేతరుడు ఒకరకమైన ఫలము ఫలించును. అది క్షణ భంగురము. వాటి అంతము మరణమే. క్రైస్తవుడు ఫలించు ఫలము నిత్యము ఉండును. అతడు క్రైస్తవ లక్షణములను ఆత్మీయ ఫలము ఫలించును. అది నిత్యజీవ ఫలము. మనం దేవుని కేది యిస్తామో దాన్నే మనం కలిగియుంటాము. క్రీస్తు పనిలో మన జీవితాలను వెచ్చించాలి. ఆ పెట్టుబడినుండి ఆయన అక్షయమగు క్రైస్తవ గుణములను నిత్యజీవాన్ని మనకనుగ్రహిస్తాడు.

నాలుగవదిగా, క్రీస్తునందలి నూతన జీవము ఒకనూతన భవిష్యత్తును కలిగియుంటాదని పౌలు చెప్పాడు. "ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము. అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసు నందు నిత్యజీవము" (రోమా 6 : 23). క్రైస్తవుడు పరలోక మార్గములో పయనించుచున్నాడు. అతడు జీవగ్రంథము లోని ఆఖరి అధ్యాయాన్ని చదివాడు. గనుక ప్రభువు పక్షానికే విజయము కలుగునని ఎరుగును. ఈలోకంలో యున్నప్పుడు అతడు దెబ్బలు తినియుండవచ్చును, గాయపర్చబడి యుండవచ్చును. అయితే తుది విజయం తనదేనని అతడెరుగును!

యోగ్యమైన మంచి మనస్సుగల ప్రతివానికి క్రీస్తునందలి నూతన జీవము ఎప్పుడు ఆకర్షణీయముగానే యుండును. మనం క్రైస్తవుల మయినప్పుడు ఆ నూతన జీవం మనదే. అది పాపమునుండి విడుదల పొందిన జీవితం, ఆయనతో సహవాసము గల జీవితం, ఫలభరితమైన జీవితం, పరలోక నిత్యజీవ నిరీక్షణ కలిగిన జీవితం, ఈ నూతన జీవితం భద్రపరచబడాలి, కొనసాగింపబడాలి. నీకెవరయినా

ఒక క్రొత్త కారు యిచ్చారనుకో, దానిని సంతోషంతో అనుభవించాలంటే దాన్ని నీవు జాగ్రత్తగా చూచుకోవాలి, భద్రంగా కాపాడుకోవాలి. నీవు దానిని క్రమంగా శుభ్రపరచక పోయినా, దాని టైర్లలో గాలి ఉంచకపోయినా, పెట్రోలు దానిలో వేయక పోయినా, అది నీదగ్గర ఎంతో కాలం మన్నదుగదా.

పాపమునుండి తాను పొందిన విడుదలను క్రైస్తవుడు జాగ్రత్తగా పరిరక్షించు కోవాలి. అతడు తన హృదయాన్ని ఎల్లవేళలా పవిత్రముగా యుంచుకోవాలి, మరల దుష్టత్వము తన జీవితంలో ఏలుబడి చేయకుండా చూచుకోవాలి. ప్రార్థన, బైబిలు పఠనము ద్వారా దేవునితో తన సహవాసాన్ని అతడు కొనసాగించుకోవాలి. క్రైస్తవులతో సహవాసం చేస్తూ దేవునితో, దినదినం నడవాలి. యితరులను క్రీస్తులోనికి నడిపిస్తు, ఆత్మ ఫలములను తాను ఫలిస్తు ముందుకు పోవాలి. తనలో యున్న నిరీక్షణ వెలుగును బట్టి నిత్యజీవ నిరీక్షణను వక్కాణిస్తు యుండాలి.

## ము గిం పు

నీవు క్రీస్తునందు ఈనాడే ఒక నూతన వ్యక్తి కాగలవు. నీవాయన పునర్నిర్మాణ పద్ధతికి లోబడాలని దేవుడు తన వాక్యము ద్వారా నిన్ను పిలుచుచున్నాడు. నీవు లోబడిన యెడల ఆయన నిన్ను నూతన వ్యక్తిగా క్రీస్తులో చేయగలడు. ఈ పద్ధతిలో ఎడబాటు, రక్షణ, నిలుకడ ఇమిడియున్నాయి. ప్రతి దశ ప్రాముఖ్యమైనది.

క్రీస్తులో ఈ నూతన జీవం కలిగియుంటే ఎట్లుండునో ఆలోచించు. నీ యింటినుండి కొన్ని దినాలు నీవు పయనించి మరల తిరిగి వచ్చేసరికి నీ యింట్లో అన్నీ క్రొత్త సంగతులే ఉన్నాయనుకో, క్రొత్త మంచాలు, క్రొత్త కుర్చీలు, క్రొత్త దుప్పట్లు, క్రొత్త

పాత్రలు వగయిరా అన్నీ ఎవరో కొని యిచ్చి వెళ్లారనుకో, నీవేమి చేస్తావు ? ఇన్ని క్రొత్తసంగతులను బట్టి నీవు ఆశ్చర్యపడవా ? సంతోషానందములతో నిజానికి నీవు గంతులు వేస్తావు. అయితే ఈ లోకంలో ఈ రకమైన అనుభవం మనకు కలుగకపోవచ్చు. వీటన్నిటి కంటె అత్యంత ప్రాధాన్యమైన దొకటి యున్నది. నీవొక నూతన వ్యక్తి కాగలవు. దేవుని దైవిక పద్ధతిని బట్టి ఈనాడే నీవు పునర్నిర్మించబడగలవు.

దేవుని నూతన జీవాన్ని పొందిన వారితో క్రీస్తు సంఘము సమకూడి యున్నది. వారు నూతన జీవిత కుటుంబము. దేవుడు నిన్ను ఒక నూతన వ్యక్తిగా చేయునప్పుడే, తన సంఘమందు కూడా చేర్చును. దేవుని నూతన నిర్మాణ పద్ధతికి లోబడుట ద్వారా నూతన జీవిత సభ్యత్వాన్ని నీవు ఎందుకు పొందకూడదు? —ఎడ్డీ క్లోర్, (T.F.T.)

—o—

## మనము కాదనలేని సత్యము

—T. జాన్ S. (ఫెడరిక్స్), పెద్దాపురం.

మానవమాత్రుడు లోకములో "కాదు" అనలేని సత్యమును మీకు తెలియపరచుచున్నాను. మనము ఏది వ్రాసినా తారీఖు లేకుండా వ్రాయముగదా? ఒక ఉత్తరముగాని, ఒక ప్రామిసరీ నోటు గాని తారీఖు లేకుండా వ్రాయలేము. ఆ వ్రాసిన దినము, నెల, సంవత్సరము ఏలాగు వచ్చినదో మానవలోకము తెలిసికొనలేకున్నారు. ప్రస్తుత సంవత్సరము 1994 వ సంవత్సరమని లెక్కించుచున్నాము. చరిత్రకారులు గ్రంథములెన్నో వ్రాయుచున్నారు. వాటిలో సంవత్సరమును బి.సి., ఏ.డి. అను సూచనలతో వ్రాయుదురు. బి. సి. అంటే బిఫోర్ క్రైస్ట్ (Before Christ) క్రీస్తు పూర్వము; ఎ. డి. అనగా ఎన్నో డొమిని (The year of the Lord) అంటే ప్రభువైన యేసు

వారియొక్క సంవత్సరము అని అర్ధము. ఈ సంవత్సరముయొక్క ప్రభావమును అన్ని దేశములు పాటించుచున్నవని మనక్కు తెలియును. ఇది మనము కాదనలేము. ప్రపంచములోనున్న న్యాయస్థానములు ఈ సంవత్సరములను పాటించుచున్నవి. అనగా క్రీస్తు ప్రభువు వారి యొక్క ప్రభావము లోకమంతట వున్నదని తెలియుచున్నది.

మన దేశములో పోస్టాఫీసులు ఎన్నో వున్నాయి. ఉత్తరములపై పోస్టాఫీసు ముద్ర లేకుండా ఆఫీసునుండి వాటిని బయటకు పంపరు. వారు వేసే ముద్ర యేసుప్రభువువారి సంవత్సరము. మన ప్రామిసరీ నోట్లు, అగ్రిమెంట్లు తేదీ లేకుండా చెల్లవని మనకు తెలియును. దేశములోని న్యాయస్థానములు సదరు తేదీ లేకుండా అంగీకరించవు. అది క్రీస్తుప్రభువువారి తేదీ. దేశములో పండుగలు, వివాహ కార్య ములు చేయుదురు. వాటిని క్రీస్తు ప్రభువువారి తేదీ, ఆ సంవత్సరము లేకుండా ప్రచురించరుగదా ? మేజస్ట్రేటువారి కోర్టులోగాని, సబ్ జడ్జి వారి కోర్టులోగాని, జిల్లాకోర్టులోగాని సదరు సంవత్సరపు తేదీ లేకుండా అంగీకరించబడవు. హైకోర్టులోగాని, సుప్రీంకోర్టులోగాని సదరు సంవత్సరపు తేదీని తప్పకుండ పాటించుదురు. అవే కాదు, ప్రపంచములో ఇంటర్ నేషనల్ జ్యూరీ ఈ సంవత్సరమును, తేదీని తప్పక పాటించుచున్నారు. దీనినిబట్టి పరిశీలించి చూడగా క్రీస్తు ప్రభువు వారి సంవత్సర ప్రభావము మానవలోకము తెలిసికొనెదరు గాక. మన దేశములో బ్యాంకులు వివిధరకములైనవి యున్నవి. మనము బ్యాంక్ లోనికి వెళ్ళినపుడు ఆ సంవత్సరము, తేదీ చూపించు చున్నారు. మనకు వారుయిచ్చే బ్యాంక్ చెక్కులలో ఆ సంవత్స రము, తేదీ లేకుండా ఆ చెక్కులు చెల్లవు. అది క్రీస్తుప్రభువువారి సంవత్సరపు తేదీ !

ఒక దేశము వేరొక దేశముపై యుద్ధము ప్రకటించినా, లేక

సమాధానము ప్రకటించినా, తేదీ లేకుండా ఆ పని చేయరు. అది క్రీస్తు ప్రభువువారి తేదీ. దేశములో ఆఫీసులు ఎన్నో వుంటాయి. ఏ ఆఫీసు అయిన క్రీస్తుప్రభువువారి సంవత్సరము పాటించకుండా వ్యవహారించలేదు, అనగా క్రీస్తుప్రభువుయొక్క ప్రభావము మనము నమ్మినా, నమ్మకపోయినా; ఆ ప్రభావము దేశమంతటా కలదని మనము అంగీకరించుట తప్పదు. ఆ ప్రభావము ప్రపంచమంతటా ఉన్నదని సమ్మతింపక తప్పదు. దేశములో మనము వ్రాయు వ్రాయించు అగ్రిమెంట్లు, దస్తావేజులు రిజిష్ట్రారువారి కార్యాలయము లలో జరుపుదురు. సదరు అగ్రిమెంట్లలోను, దస్తావేజులలోను సంవత్సరపు తేదీ బహు అవశ్యము, అవశ్యకరము. ఆ తేదీలేకుండా ఆపత్రము ఏ న్యాయస్థానములోను చెల్లదుకదా. అనగా క్రీస్తుప్రభువు వారి ప్రభావము లోకమంతటా వ్యాపించియున్నది. మీరు, నేను, మరియెవ్వరును కాదనలేని సత్యమేగదా! మీరును ఆలోచింపుడు.

దేశమునందు ఎన్నో వార్తా పత్రికలు ఉన్నవి. ఈ పత్రికలు తేదీ లేకుండా వుండవుగదా! అవి దినము, నెల, సంవత్సరమును సూచించును. ఆ సంవత్సరము క్రీస్తు యేసుప్రభువువారి సంవత్సరము (**Anno Domeni**). సంవత్సరాంతమున మనము క్రొత్త కేలండర్ల కొరకు ఆసక్తితో గాలించుదుము. కేలండరు లేకుండా మన దిన చర్యలు జరుగవు. ఆ కేలండర్లు చూపించు సంవత్సరము, నెల, తేదీ యేసుక్రీస్తు ప్రభువువారి సంవత్సరము. దేశమునందున్న కార్యా లయములు ఎన్నో వున్నవి. వాటి, వాటి విభాగములు చాల కలవు. ఏ కార్యాలయము వారైనా, వారు జారీచేసెడు తాకీదులలో తారీ ఖులు లేకుండా వుండవు. దీనినిబట్టి పరిశీలించి చూడగా క్రీస్తు యేసు ప్రభువువారి ప్రభావము దేశములన్నిటిలో, ప్రపంచ మంతటిలో నిండియున్నది.

## ఇంతకీ యేసు క్రీస్తు ప్రభువు యెవరు ?

బైబిలులో 66 గ్రంథములున్నవి. ఈ బైబిలులో రోమీయు లకు వ్రాసిన పత్రికలో యేసుప్రభువు వారిని గురించి "ఈయన సర్వాధి

కారియైన దేవుడై యుండి నిరంతరము స్తోత్రార్హుడై యున్నాడు" అనియు, 1వ యోహాను చివరి అధ్యాయములో యేసుప్రభువు వారిని గూర్చి "ఈయనే నిజమైన దేవుడును, నిత్యజీవమునై యున్నాడు" అనియు, తీతు వ్రాసిన పత్రికలో "యేసుప్రభువువారు మహాదేవుడు" అనియు సూచింపబడినది. యోహాను సువార్త మొదటి అధ్యాయములో ప్రభువువారిని గురించి ఈలాగున వ్రాయబడియున్నది: "వాక్యము దేవుని యొద్ద వుండెను, వాక్యము దేవుడై యుండెను". ప్రపంచములుగాని మానవలోకముగాని పుట్టక మునుపు యేసు ప్రభువువారు దేవుడై యున్నారు. హెబ్రీయులకు వ్రాసిన పత్రికలో మొదటి అధ్యాయము 2వ వచనములో "ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను". కొలస్సయుల పత్రిక మొదటి అధ్యాయములో ఈలాగు వ్రాయబడినది: "ప్రభుత్వములైనను, ప్రధానులైనను, అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా వున్నవాడు. ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు" (సశేషము)


Regd. No. H/KD—45/KD H.O



From
SATYA VAKKU
P.O. Box 80
KAKINADA 533 001


No.

To
..............................................
..............................................
..............................................
..............................................